క్లుప్తంగా

టంగుటూరికి ఘన నివాళి



జెడ్పీ కార్యాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు చెక్ పెట్టాలి



ఎమ్మెల్యే నానిని కలిసిన ఎస్ఈబీ ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో మద్యం, ఇసుక, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అడ్డుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని సూచించారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తన కుమార్తె వివాహ వేడుకలకు హాజరుకావాలంటూ ఆహ్వానపత్రికను నానికి అందజేశారు.

నిరాధార ఆరోపణలు

ఏలూరు (టూటౌన్): వైద్య విద్యపై విపక్ష పార్టీల నేతలు నిరాధారమైన ఆరోపణలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఏలూరు జిల్లా నాయకులు పితాని దుర్గాప్రసాద్, సీపీఎస్ ఆచార్యులు, చదలవాడ వెంకటరమణ ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయకుండా ప్రైవేట్, కార్పొరేట్ వైద్య కళాశాలలకే పట్టం కట్టారని గుర్తుచేశారు. టీడీపీ నాయకులు, సానుభూతిపరులకు వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకోవటానికి అనుమతిచ్చి, వారి జేబులు నింపుకున్నారన్నారని విమర్శించారు. రాష్ట్రంలో 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉంటే సీఎం జగన్ రూ.8,480 కోట్ల వ్యయంతో ఏకంగా కొత్తగా 17 మెడికల్ కాలేజీలను

చంద్రయాన్ విజయవంతంపై హర్షాతిరేకాలు





ప్రదర్శన నిర్వహిస్తున్న బాలవికాస్ భారతి నాయకులు, మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో చంద్రయాన్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఏలూరు రూరల్: చంద్రయాన్–3 విజయవంతం కావడంపై సర్వత్రా హర్షం వెల్లువెత్తింది. బుధవారం సాయంత్రం మాదేపల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు ఆధ్వర్యంలో పాఠశాలలో చంద్రయాన్ ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు తిలకించారు. చంద్రయాన్ జాబిలిపై కాలు మోపడంతో పిల్లలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మరోపక్క చంద్రయాన్ విజయం దేశానికి ఎంతో మేలు చేస్తుందని ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

ఏలూరు (టూటౌన్): దేశం గర్వించే విధంగా ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంలో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ బుధవారం ఒక ప్రకటన కొనియాడారు. ప్రపంచ పటంలో భారత దేశం సత్తా ఏంటో చూపించడం ద్వారా ప్రజలు గర్వించే విధంగా పేర్కొన్నారు. ఇంతటి గొప్ప విజయంలో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రభుత్వాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పూజలు, ర్యాలీలు

చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ పలు చోట్ల పూజలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సుదురుపాటి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో స్థానిక మాదేపల్లిలోని ఆగస్త్య క్షేత్రమైన శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో పూజలు చేశారు. యువమోర్చా ప్రధాన కార్యదర్శి అదపాక నాగ సురేష్, ఉపాధ్యక్షుడు ఎర్రించి ముఖేష్, యువమోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు. బాలవికాస్ భారతి ఆధ్వర్యంలో స్థానిక పవరుపేటలో చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ర్యాలీ నిర్వహించారు. బాలవికాస్ భారతి అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగంలో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సదానంద మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డి.బాబు, మేతర అజయ్ బాబు, విభిన్న ప్రతిభావంతులు జాకోబ్, ఉపాధ్యాయురాలు వి.రజిని, మేతర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుద్దలతో రాకెట్



సుద్దలతో తయారు చేసిన రాకెట్

ఏలూరు (టూటౌన్): ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో మైక్రో ఆర్టిస్ట్ దొర శివప్రసాద్ సుద్ద ముక్కపై రాకెట్ రూపాన్ని తయారు చేసి తన హర్షాన్ని వ్యక్తంచేశారు. రెండు అడుగుల ఎత్తుతో దీన్ని తయారు చేశారు.

- చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు. చంద్రుని దక్షిణ ధృవంపై విజయవంతంగా విక్రం రోవర్ ల్యాండ్ అవటం, ఆ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని, ప్రపంచంలో అగ్రరాజ్యంగా భారత్ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పాఠశాలకు పుస్తకాలు అందిస్తున్న సంకల్పం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం సిద్ధిస్తుందని స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుటుంబరావు సూచించారు. నగరానికి చెందిన సంకల్పం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస ఆంధ్రులు యడ్ల శ్రీకాంత్, అనీష్, అపూర్వల ఆర్థిక సహకారంతో సుబ్బమ్మదేవి పాఠశాల గ్రంథాలయానికి రూ.25 వేల విలువైన పలు విజ్ఞాన సంబంధిత పుస్తకాలను ఆ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు మాత్రమే అందుబాటులో ఉండేవని, నేడు విజ్ఞాన సంబంధిత పుస్తకాలను కూడా అందించడానికి ముందుకురావడం శుభపరిణామమని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ రత్నకుమార్ మాట్లాడుతూ తాము ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి సామాజిక విలువలను తెలుసుకున్నామన్నారు. కార్యక్రమంలో సంకల్పం ట్రస్ట్ ప్రతినిధులు రుద్రరాజు హరిరాజు, నంబూరి వర్మ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ ప్రచారం ఓ డ్రామా

ఏలూరు (టూటౌన్): నారా లోకేష్ చేసే పాదయాత్రలో బీసీలు, చేతివృత్తిదారులతో ముఖాముఖి సమావేశాలు అంటూ.. అధికారం ఇస్తే ఉద్ధరిస్తామంటూ చేస్తోన్న ప్రచారం అంతా ఓ డ్రామా అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి విమర్శించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. టీడీపీ హయాంలో చేతి, కుల వృత్తుల వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో కోట్లాది రూపాయలు దోచుకొన్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ ఒక్కటేనని వివరించారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆళ్ల నాని బీసీ కులాలకు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేశారని వివరించారు.

స్వావలంబి భారత్ అభియాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆలోచనలే పెట్టుబడిగా ఉన్న రంగాలను విద్యార్థులు ఎంచుకుని వాటిలో విజయవంతం కావాలని నగరానికి చెందిన వ్యాపారవేత్త నారా శేషు సూచించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నిర్వహిస్తోన్న స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శేషు మాట్లాడుతూ యువత ఉపాధి కోసం వెతకకుండా ఉపాధి కల్పనకు అవకాశం ఉన్న రంగాల కోసం వెదకాలని తద్వారా తమతో పాటు మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యవక్త పి.పావని స్వావలంబి భారత్ అభియాన్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ లీగల్ ప్రముఖ్ కె.సాయి, విభాగ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసి చితక బాదారని ఫిర్యాదు

ఏలూరు టౌన్: భార్య బంధువులు తనను కిడ్నాప్ చేసి చితకబాదారంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన తాడిచెట్టు కృష్ణంరాజుకు అతని భార్యకు గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 22వ తేదీ రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఆమె మంగళగిరిలో ఉన్న పుట్టింటి వారికి ఫోన్ చేసింది. ఆమె పుట్టింటి వారు వచ్చి కృష్ణంరాజును అర్ధరాత్రి వేళ కొట్టుకుంటూ తీసుకెళ్లి మంగళగిరిలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. వారి చెర నుంచి తప్పించుకొచ్చిన కృష్ణంరాజు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గండికోట నాగరాజు, మరో ఆరుగురిపై కిడ్నాప్ కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక బాధలు తట్టుకోలేక ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఆర్థిక బాధలు తట్టుకోలేక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధికి చెందిన నవలవరపు ప్రకాష్ (24) భార్య చిన్న దుర్గ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. చెడు వ్యసనాలకు బానిసై అప్పులపాలయ్యాడు. అతనికి క్యాన్సర్ ఉందనే అనుమానంతో తీవ్ర మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి పెంచుకుని బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఈ సంఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్ టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి

- రహదారుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పెదపాడులో మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు : గ్రామాల్లో సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో వివిధ శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ భవనాలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ మండలంలోని రహదారులు అభివృద్ధి చేస్తున్నామని పెదపాడు పెరికీడు రహదారి పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యలు వాటి పరిష్కారంపై అధికారులను ప్రశ్నించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ నిరంతరాయంగా తొమ్మిది గంటలపాటు ఉచితంగా అందిస్తామన్నారు. ఏ గ్రామంలోనూ లో ఓల్టేజీ సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సత్యవోలులో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి త్వరలో అనుమతులు రావాల్సి ఉందన్నారు. మండలంలోని వట్లూరు కొప్పాక, వట్లూరు కొక్కిరపాడు, కలపర్రు–వట్లూరు రహదారులను అభివృద్ధి చేసామని, కలపర్రు దాసరిగూడెం రహదారి నిర్మాణంలో ఉందన్నారు. నాయుడుగూడెం–రాజుపేట, సత్యవోలు వడ్డిగూడెం, కొత్తూరు ముప్పర్రు రహదారికి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రానున్న ఆరు నెలల్లో మిగతా రహదారులు సైతం పూర్తి చేస్తామని చెప్పారు. జేజేఎం ద్వారా నాయుడుగూడెం, కడిమికుంట, ఖాజీగూడెం సత్యన్నారాయణపురం, పెదపాడు గ్రామాల్లో పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గృహనిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ ఎంపీపీలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీడీవో ఎస్‌నిర్మల జ్యోతి, తహసీల్దార్ జీ విజయ్ కుమార్ రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గొట్టాపు నర్సింహరావు, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పద్మశ్రీని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

వెలమ సామాజిక వర్గానికి సముచిత స్థానం



జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ దంపతులను సత్కరిస్తున్న కొఠారు రామచంద్రరావు, కొప్పల వెలమ నేతలు

పెదపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొప్పుల వెలమలకు అధిక ప్రాధాన్యత నిచ్చారని, వారంతా పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు తెలిపారు. పెదపాడులోని విత్తన శుద్ధి కర్మాగారం వద్ద కొప్పుల వెలమ ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొఠారు రామచంద్రదరావు మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్ సముచిత స్థానం కల్పించారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని తెలిపారు. పెదపాడు మండలంలోని వెలమ సామాజికవర్గ ప్రజలంతా భారీ ఎత్తున తరలివచ్చి ఘనంగా సత్కరించారు. గజమాలతోను శాలువాలతోను జెడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చెర్మన్ గొట్టాపు నర్సింహరావు, సీనియర్ నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, ఏలూరు జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడు మరడ అనీల్‌కుమార్, కార్పొరేటర్ కిలాడి దుర్గారావు, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సత్యవోలు సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, వసంతవాడ సర్పంచ్ చింతల రమాభారతి, వీరమ్మకుంట సర్పంచ్ మరడాన చంటిబాబు, దాసరి పెదబాబు, గుణుపూరు మహేష్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు, అక్కినేని రాజశేఖర్, అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, స్థానిక సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి, సీనియర్ నాయకుడు గారపాటి బాస్కరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం రాత్రి పోతునూరులో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి) ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు పోతునూరులో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తలపెట్టారని అన్నారు. అర్హులైన వారికి కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు విధిగా అందాలన్నది ముఖ్యమంత్రి అభిమతమన్నారు. హామీ ఇచ్చిన పథకాలతో పాటు అనేక కొత్త పథకాలు అమలు చేస్తూ ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. గడిచిన మూడున్నరేళ్లల్లో ప్రభుత్వం ద్వారా వచ్చిన పథకాల లబ్ధిని ఇంటింటా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. ప్రపంచ మానవాళి చరిత్రలో నూతన అధ్యయనానికి నాంది పలికిన రోజుగా చంద్రయాన్–3 చందమామపైకి చేరిన రోజు గుర్తుండిపోతుందన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఇస్రో శాస్త్రవేత్తల చరిత్ర సృష్టించారని అన్నారు.

చంద్రయాన్ విజయవంతం జాతికి అంకితం

చంద్రయాన్–3 విజయవంతం జాతికి అంకితమని ప్రతి భారతీయుడు గర్వపడే రోజుగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అభివర్ణించారు.

శాశ్వత భూహక్కుపై సర్వే

బుట్టాయగూడెం : గ్రామాల్లో ప్రతి ఆస్తిని సర్వేచేసి వివాదాలు లేకుండా కొలతలు తీసుకోవాలని, సర్వేను పూర్తి చేయాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ రజాఉల్లా అన్నారు. బుట్టాయగూడెం మండలంలో ఎంపికైన 8 పంచాయతీల పరిధిలో శాశ్వత భూహక్కు – భూరక్ష, స్వమిత్ర కార్యక్రమం అమలుపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తయిన అనంతరం గ్రామ సభల్లో యాజమాన్య హక్కుపత్రాలను పంపిణీ చేస్తారన్నారు. భూహక్కు – భూరక్ష పథకంలో చేపడుతున్న రీసర్వేలో గ్రామ కంఠాల సర్వే అత్యంత కీలకమని అన్నారు. ప్రతిస్థాయిలో జరిగే సర్వేలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ శ్రీహరి, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు కట్టుబడిన వారికే మద్దతు



కొప్పాకలోని బాబూజగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదవేగి : ఎస్సీ వర్గీకరణకు ఏ పార్టీ కట్టుబడి ఉంటుందో వారికే ఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పెదవేగి మండలం కొప్పాకలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి అన్ని రాజకీయ పార్టీలు మాదిగ ప్రజలను మోసం చేస్తున్నాయని, హామీ ఇవ్వడం ఎన్నికలు అయిన వెంటనే వాటిని మర్చిపోతున్నాయని ఆయన తెలిపారు. ఇకనైనా మాదిగ నాయకులు రాబోయే ఎన్నికల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్, జిల్లా నాయకులు ఎర్రా నాగమల్లేశ్వరరావు, కోడెల్లి వెంకట్రావు, కొల్లూరి రామకృష్ణ, జిజ్జువరపు రాజు, మానుకొండ ఆశీర్వాదం, శొంగ జోజి, జయరాజు, రంగారావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64-120
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07-10
బెండకాయలు	28	కంద	36
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	36
కాకర కాయలు	50-60	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	32	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	28-44	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	--
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	28